
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
9-7-2026 (Thursday)
MAIN EDITION

## గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్



**అక్షరటుడే, నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయింది. ఈ ఘటనలో 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో గురువారం ఉదయం విద్యార్థులు టిఫిన్ చేశారు. అనంతరం అస్వస్థతకు గురి అయ్యారు. దీంతో సిబ్బంది వారిని వెంటనే మన్ననూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అచ్చంపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు.

## ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** హర్ముజ్ జలసంధిలో నౌకలపై దాడుల నేపథ్యంలో ఇరాన్‌లోని 80 సైనిక స్థావరాలపై అమెరికా భారీ ఎయిర్ స్ట్రైక్స్ చేసింది. దీనికి ప్రతికారంగా బహ్రెయిన్, కువైట్‌లలోని యూఎస్ స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. హర్ముజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ హెచ్చరించగా, చమురు కేంద్రాలపై దాడి చేస్తామని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. హర్ముజ్ జలసంధిపై ఉన్న ఓడరేవు నగరాలైన సిరిక్, బందర్ అబ్బాస్‌తో సహా, దేశంలోని దక్షిణ ప్రాంతాలలో పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా నివేదించింది.

## ఓఆర్ఆర్ బయటకు పరిశ్రమలు



అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ నివాస యోగ్యమైన నగరంగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్‌లో 'ప్రీమియర్ ఎనర్జీస్' నూతన సోలార్ మాడ్యూల్స్ తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.

## పెళ్లి వేడుకలో జంట హత్యలు



అక్షరటుడే, ఏపీ : తిరుపతిలో జంట హత్యలు తీవ్ర కలకలం రేపాయి. పద్మావతి కల్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకలో ఇద్దరు వ్యక్తులు దారుణంగా హత్యకు గురయ్యారు. మృతులను మునిరత్నం (50), మణికంఠ (42)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మూసీ తొలి దశ పనులపై సమీక్ష



అక్షరటుడే, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్ట్ మొదటి దశకు సంబంధించిన కీలక ప్రాంతాలను పరిశీలించారు. వీటిలో ఉస్మాన్‌సాగర్, నార్సింగి ఎస్‌టీపీ సైట్ మరియు గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ భూములు ఉన్నాయి. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు

## కొట్టుకుపోయిన మూడు వేల సిలిండర్లు



**అక్షరటుడే, ముంబై :** మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. రాయఘడ్ ప్రాంతంలోని పాతాళగంగ వద్ద ఉన్న హెచ్‌పీసీఎల్ బాట్లింగ్ ప్లాంట్లోకి వరద నీరు రావడంతో ప్రహరీ కూలిపోయింది. దీంతో మూడు వేల సిలిండర్లు కొట్టుకుపోయాయి. నదిలో, సమీప ప్రాంతాల్లో తేలుతున్న ఈ గ్యాస్ సిలిండర్లు ఎవరికైనా కనిపిస్తే, వాటిని వెంటనే సంబంధిత అధికారులకు లేదా కంపెనీకి అప్పగించాలని రాయ్‌గఢ్ కలెక్టర్ కిషన్ జవ్లే ప్రజలకు కోరారు. భద్రతా కారణాల దృష్ట్యా, ప్రజలు ఈ సిలిండర్లను తమ ఇళ్లలో ఉంచుకోవద్దని, వీలైనంత త్వరగా వాటిని యంత్రాంగానికి లేదా కంపెనీకి అప్పగించడంలో సహకరించాలన్నారు.



# ఆంధ్ర కాంట్రాక్టర్ల నుంచి బీఆర్ఎస్‌కు డబ్బు

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ఆంధ్ర కాంట్రాక్టర్ల నుంచి క్విడ్ ప్రోకో ద్వారా బీఆర్ఎస్‌కు భారీగా డబ్బులు వచ్చాయన్నారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావు అవినీతి అనకొండ అని వ్యాఖ్యానించారు.ఆయనను ముందు పెట్టినన్ని రోజులు బీఆర్ఎస్ బాగు పడదని పేర్కొన్నారు.

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

■ అవినీతి అనకొండ హరీశ్‌రావు ■ ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ విషయంలో క్విడ్ ప్రోకో ■ టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు

కల్వకుంట్ల కవిత బాయి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తగూడెంలోని పీవీకే5 గనిని పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ బ్యాంకు ఖాతాల్లోని రూ.1,400 కోట్లు ఆంధ్ర కాంట్రాక్టర్ల నుంచి క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయన్నారు. అది అవినీతి సొమ్ము, దానిని తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్‌లో చేరను

ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ విషయంలో క్విడ్ ప్రోకో విధానంలో కేటీఆర్ అవినీతికి పాల్పడ్డారని కవిత ఆరోపించారు. తాను బతికున్నంత కాలం బీఆర్ఎస్‌లో చేరనని స్పష్టం చేశారు. కేటీఆర్ రూ.188 కోట్లు పెట్టి ది పయనీర్ అనే ఇంగ్లిష్ పత్రికను కొనుగోలు చేశారన్నారు. అందులో వచ్చే వార్తలు నమ్మొద్దని సూచించారు. ఫీనిక్స్‌ను కేటీఆర్, హరీష్ రావు పోషించి, రక్షించలేదా అని కవిత ప్రశ్నించారు. ఈ సంస్థ 33 లక్షల టన్నుల కలపను నరికిందన్నారు.

### భూములు స్వాధీనం చేసుకుంటాం

కాళేశ్వరంలో అవినీతి అనకొండ హరీశ్‌రావు అని కవిత ఆరోపించారు. గుంటనక్కను ముందు పెడుతున్న బీఆర్ఎస్ పార్టీ జన్మలో బాగు పడదని, అధికారంలోకి రాదన్నారు. తన పార్టీపై బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల సంఘానికి వెయ్యి ఫిర్యాదులు చేశారన్నారు. తన పార్టీతో భయం లేదన్న నాయకులు.. ఇప్పుడు ఎందుకు ఫిర్యాదు చేశారని ప్రశ్నించారు. తన వార్తలు వేయకుండా బీఆర్ఎస్ నాయకులు మీడియా సంస్థలకు ఫోన్లు చేస్తున్నారని ఆరోపించారు. హరీష్ రావు కంపెనీ శ్రీ చైతన్య విద్యాసంస్థలకు పాలు సరఫరా చేస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన అన్ని భూములను తాము అధికారంలోకి వచ్చాక సమీక్షిస్తామన్నారు.

### కార్మికుల సమస్యలపై పోరాటం

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తాము కృషి చేస్తామని కల్వకుంట్ల కవిత తెలిపారు. తెలంగాణ బొగ్గు గనులను టెండర్ లేకుండా సింగరేణికి కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 20లోపు మెడికల్ బోర్డుపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు.

## అణుశక్తి ఒప్పందంపై భారత్, ఆస్ట్రేలియా సంతకం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** భారత్‌ఆస్ట్రేలియా వార్షిక సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి. ద్వైపాక్షిక సంబంధాలలో ఒక చారిత్రాత్మక అధ్యాయాన్ని ప్రారంభిస్తూ, భారత్, ఆస్ట్రేలియా గురువారం ఒక చారిత్రాత్మక అణుశక్తి ఒప్పందంపై సంతకం చేశాయి. దీని ప్రకారం.. పౌర అణు కార్యక్రమానికి ఇంధనంగా ఉపయోగపడే యురేనియంను కాన్‌బెర్రా సరఫరా చేస్తుంది. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా ప్రధానమంత్రి అల్బనీస్‌తో కలిసి సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ అణు పురోగతి భారతదేశ పర్యావరణ లక్ష్యాలకు ఒక పరివర్తన ఉత్ప్రేరకం అని ప్రకటించారు. ఆస్ట్రేలియా భారత్‌కు యురేనియం సరఫరా చేస్తుంది. మేము అణుశక్తి రంగంలో ఒక ముఖ్యమైన ఒప్పందంపై సంతకం చేశాము. ఇది మా స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు కొత్త ఊపునిస్తుంది అని ప్రధాని మోదీ ప్రకటించారు.

## పీసీసీ చీఫ్‌కు మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు




**అక్షరటుడే, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య ఆధిపత్య పోరు తీవ్రస్థాయికి చేరింది. ఈ అంశంపై మంత్రి కొండా సురేఖ గురువారం ఉదయం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిశారు. కడియం శ్రీహరి తీరుపై తన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ, ఆయనపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ గొడవపై తాను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆమె వెల్లడించారు. మంత్రి ఫిర్యాదుపై మహేశ్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. గ్రూపు రాజకీయాల వల్ల పార్టీ ప్రతిష్టకు నష్టం వాటిల్లితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## కొత్తజంట కోసం ట్రైన్‌లో హనీమూన్ సెటప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఒక జంట జూలై 6న తమ 'ఫస్ట్ ఏసీ కూపే'ను అలంకరించుకోవడానికి ఆన్‌లైన్ ద్వారా ఒక డెకరేటర్‌ను వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకున్నారు. జాల్నా స్టేషన్ వద్ద ఆ డెకరేటర్ కోచ్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించారు. అనంతరం హనీమూన్ సెటప్‌లో కోచ్‌ను అలంకరించాడు. ఈ వీడియో వైరల్ కావడంతో రైల్వే భద్రతపై పలువురు ప్రశ్నలు లేవనెత్తారు. బయటి వ్యక్తులు అనుమతి లేకుండా ఎలా కోచ్‌లోకి వచ్చారని ప్రశ్నించారు. ఈ విషయం రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టికి వెళ్లింది. సదరు డెకరేటర్ అనుమతి లేకుండా ప్రవేశించడం అనధికారికమైన చర్య అని, ఇది తీవ్రమైన లోపంగా అధికారులు పరిగణించారు. దీనికి బాధ్యుడిని చేస్తూ ఒక టీటీఈని సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్రమైన శాఖాపరమైన విచారణకు ఆదేశాలు చేశారు.

## డయాబెటిస్ పేషెంట్లకు గుడ్ న్యూస్..




**అక్షరటుడే, ఢిల్లీ :** మధుమేహం (డయాబెటిస్) బాధితులకు ఊరటనిచ్చే వార్త. రోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకోవాల్సిన బాధ నుంచి రోగులకు విముక్తి కల్పిస్తూ, ప్రముఖ ఫార్మా సంస్థ 'నోవో నార్డిస్క్' వినూత్నమైన మందును భారత్‌లో విడుదల చేసింది. (ఇన్సులిన్ ఐకోడెక్) పేరుతో ప్రవేశపెట్టిన ఈ ఇన్సులిన్, వారానికి ఒకసారి తీసుకుంటే సరిపోతుంది. సాధారణంగా డయాబెటిస్ ఉన్నవారు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడానికి ప్రతిరోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల సంవత్సరానికి దాదాపు 365 సార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. కానీ, ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన తో రోగులు వారానికి ఒకే ఒక ఇంజెక్షన్ తీసుకుంటే సరిపోతుంది.

## శంషాబాద్‌లో బొలెరో బీభత్సం




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో బొలెరో వాహనం బీభత్సం సృష్టించింది. బస్సు కోసం నిరీక్షిస్తున్న మహిళలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. శంషాబాద్ సత్తంరాయి వద్ద బస్టాండ్‌లో ఎదురు చూస్తున్న మహిళలపైకి మిర్చి లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం గురువారం ఉదయం దూసుకెళ్లింది. ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయడానికి యత్నించగా.. వాహనం స్కిడ్ కావడంతో మహిళలను ఢీకొంది. దీంతో వాహనం కింద పడి సుమ, సువర్ణ అనే మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు.

## దిగువన గోదావరికి జలకళ



**అక్షరటుడే, హైదరాబాద్ :** గోదావరి నది ఎగువన వెలవెలబోతోంది. మరోవైపు దిగువన కాళేశ్వరం వద్ద మాత్రం కళకళలాడుతోంది. అయితే ఆ నీరు రాష్ట్ర రైతులకు ఉపయోగపడడం లేదు. రాష్ట్రంలో వర్షాలు పడడం లేదు. అంతేగాకుండా మహారాష్ట్రలో బాబ్లీ ప్రాజెక్ట్ ఎగువన సైతం భారీ వర్షాలు పడడం లేదు. దీంతో ఎగువన గోదావరికి ప్రవాహం లేక వెలవెలబోతుంది. ప్రాజెక్ట్‌పై గల శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి నీరు లేక బోసిపోతున్నాయి. మరోవైపు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో దిగువన గోదావరి ఉప్పొంగుతోంది. ప్రాణహితకు భారీ వరద వస్తుండడంతో మేడిగడ్డ వద్ద 70 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ఎన్‌డీఎస్ఏ సూచన మేరకు అధికారులు నీటిని నిల్వ చేయడం లేదు. 85 గేట్లు తెరిచి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు.

## హెచ్–1బీ మోసాలకు బ్రేక్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే విదేశీ నిపుణులు, ముఖ్యంగా భారతీయ ఐటీ ఉద్యోగులు అత్యంత కీలకంగా భావించే హెచ్ 1B వీసా ప్రక్రియపై అమెరికా ప్రభుత్వం దృష్టి సారించింది. వీసా నిబంధనల ఉల్లంఘనలు, అక్రమాలపై యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ సమగ్ర దర్యాప్తును ప్రారంభించింది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాలోని ఉద్యోగ అవకాశాలు మొదట తమ దేశ పౌరులకే దక్కాలని ఆయన స్పష్టం చేశారు. కొన్ని కంపెనీలు తక్కువ వేతనాలకే విదేశీయులను పనిలోకి తీసుకునేందుకు హెచ్-1బీ వీసా వ్యవస్థలోని లూప్‌హోల్స్‌ను ఆసరాగా చేసుకుంటున్నాయని, ఇటువంటి మోసాలను ఇకపై సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఫేక్ డాక్యుమెంట్లతో అక్రమాలకు పాల్పడే ఐటీ సంస్థలు, కన్సల్టెన్సీల భరతం పడతామని హెచ్చరించారు.